ఆత్మస్థైర్యం పెంపునకు క్రీడలు దోహదం



క్రీడా విన్యాసాలు ప్రదర్శిస్తున్న పాఠశాల చిన్నారులు

చంపాపేట: విద్యార్థి దశ నుంచే చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే వారిలో శారీరక, మానసిక దృఢత్వంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జీపీ ఫల్గుణ అన్నారు. శనివారం చంపాపేటలోని రవీంద్ర భారతి గ్లోబల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కబడ్డీ, కోకో వంటి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో రవీంద్రభారతి విద్యా సంస్థల చైర్మన్ సుబ్రహ్మణ్యం, మేనేజింగ్ డైరెక్టర్లు రేవంత్, ప్రణీత్, జోనల్ ఇన్‌చార్జి బాబూరావు, అకడమిక్ డైరెక్టర్ రాణి, ప్రిన్సిపాల్ ఆలేటి కవిత, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఒలింపిక్ క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న జీపీ ఫల్గుణ

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 35, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 55, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 37, దొండ 28–37, చిక్కుడు 23–45, గోకర 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 70, ఆలు 21–27, దోస 35, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 55. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పేదలకు దుప్పట్ల పంపిణీ



మన్సూరాబాద్: గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ రోడ్లపై నిద్రిస్తున్న పేదలకు శుక్రవారం రాత్రి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఎల్‌బీనగర్, కొత్తపేట, మన్సూరాబాద్, నాగోలు, మలక్‌పేట్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నివసిస్తున్న వారికి చలిని తట్టుకునేందుకు దుప్పట్లు అందజేశామని కృష్ణకుమార్ చెప్పారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

హయత్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపైనా ఆసక్తిని పెంచుకోవాలని, ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యత సాధించవచ్చని ప్రముఖ హాకీ క్రీడాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్.ముఖేష్‌కుమార్ అన్నారు. శనివారం హయత్‌నగర్‌లోని జీ స్కూల్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం వల్ల విద్యార్థుల వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు దేశ ప్రతిష్ఠ కూడా పెరుగుతుందన్నారు. పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. జీ స్కూల్ వంటి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు అనంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగేంద్రబాబు, గిరిజల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పూర్ణా శ్రీవాస్తవ, క్రీడా డైరెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు కచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి సూచించారు. శనివారం శంకేశ్వరబజార్‌లోని నాలా వద్ద నిర్మిస్తున్న రిటర్నింగ్ వాల్ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో నాలా పొంగి సమీప బస్తీల్లోకి వరదనీరు చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని అన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులతో చర్చించి ఇక్కడ రిటర్నింగ్ వాల్ నిర్మిస్తున్నామన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, చంద్రయ్య, శంకేశ్వరబజార్ బస్తీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలా కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి పాఠశాలలోని వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్, మమత, మల్లేశ్‌గౌడ్, రేణుక, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మాతృశ్రీ’లో అలరించిన నోవాటో ఫీస్టా 2కే 24



విద్యార్థుల సంగీత ప్రదర్శన

సైదాబాద్: ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు ఆసక్తితో అన్ని నేర్చుకోవాలనే జిజ్ఞాస కలిగి ఉండాలని సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంత రావు అన్నారు. శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన నోవాటో ఫీస్టా 2కే 24 అందరినీ అలరించింది. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు పలు ప్రదర్శనలతో అలరించారు. నోవాటో ఫీస్టాలో భాగంగా విద్యార్థులు సంగీతం, నృత్యం, డ్రామా అంశాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ విద్యార్థులతో కలిసి జూనియర్లు డ్యాన్స్‌లతో సందడి చేశారు. మాతృశ్రీ మ్యూజిక్ బ్యాండ్ పేరుతో విద్యార్థులు చేసిన సంగీత ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నూతన విద్యార్థులకు నిర్వహించిన మిస్టర్ అండ్ మిస్ ఫ్రెషర్స్ 2కే 24 పోటీల వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేపీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, కోశాధికారి జూపూడి సుధాకర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన జానకి



సైదాబాద్: సౌత్‌ఈస్ట్ జోన్ నూతన డీసీపీగా డి.జానకి బాధ్యతలు స్వీకరించారు. శనివారం సైదాబాద్‌లోని సౌత్ ఈస్ట్ జోన్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. రాచకొండ కమిషనరేట్‌లోని మల్కాజిగిరి డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీసీపీగా విధులు నిర్వహించిన బిరుదురాజు రోహిత్‌రాజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరింటిండెంట్‌గా బదిలీపై వెళ్లారు.

శ్రీరామ సంకీర్తనలతో గడప గడపకూ అక్షింతలు



లలితానగర్‌లో శ్రీరామ పూజిత అక్షింతల కలశంతో రామ భక్తులు



భక్తులకు అక్షింతలు అందజేస్తున్న కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చాకి రవికుమార్

చాదర్‌ఘాట్: అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను శనివారం ఓల్డ మలక్‌పేట హనుమాన్ ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు పంపిణీ చేశారు. పోచమ్మ ఆలయ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున ఆలయం చైర్మన్ చాకి రవికుమార్‌లు అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. బాబు సుదర్శన్, అమర్నాథ్‌గౌడ్, నరసింహ, దామోదర్, జ్ఞానేశ్వర్, శివగౌడ్‌లు పాల్గొన్నారు.

లలితానగర్‌లో...

చైతన్యపురి: గడ్డి అన్నారం లలితానగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో అయోధ్య రాముల వారి అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. ముందుగా అక్షింతలను వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలోని స్వామివారికి సమర్పించారు. శ్రీరామ భక్తులు రామ సంకీర్తనలతో అక్షింతలను కాలనీలోని ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమేష్, శ్రీనివాస రావు, మ నోహర్, ఆలయ చైర్మన్ పూర నర్సింహ గుప్తా, సభ్యులు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ధ్యానాంజనేయ ఆలయంలో...

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆలయ పాలకమండలి సభ్యులు అయోధ్య రాముల వారి అక్షింతలను భక్తులకు అందజేశారు. ముందుగా ఆలయ అర్చకులు ధ్యానాంజనే స్వామికి అక్షింతలను సమర్పించి, వేద మంత్రోశ్చరణలతో పూజలు చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’కు విశేష స్పందన

చాదర్‌ఘాట్: ప్రజాపాలన దరఖాస్తులకు మలక్‌పేటలో విశేష స్పందన లభించిందని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ అక్బర్ అన్నారు. దరఖాస్తుల సేకరణ శనివారం ముగియనుండటంతో ఆయన వివిధ దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అభయహస్తంలోని ఆరు గ్యారెంటీ పథకాలను పారదర్శకంగా అందిస్తుందన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌లోని న్యూగడ్డి అన్నారం కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శివగంగా థియేటర్ సమీపంలోని ఇరిగేషన్ శాఖ నాలా పక్కన ఉన్న స్థలంలో చేపట్టిన నిర్మాణాలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ఆ స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. కబ్జాదారులపై అధికారులు చర్యలు తీసుకోక పోతే కాలనీవాసులతో కలిసి ధర్నా చేస్తామని ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

‘కాంగ్రెస్ ప్రభుత్వం.. సకలజన హితం’

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సకలజన హితం, ప్రజా ప్రభుత్వం అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణకు శనివారం చివరి రోజు కావడంతో ఆయన ఆర్‌కే పురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించారు. పలువురి దరఖాస్తు ఫారాల్లో వివరాలను నింపి వాటిని దరఖాస్తుదారులతో అధికారులకు ఇప్పించారు. కార్యక్రమంలో కాలనీ సెక్రటరీ నరసింహారెడ్డి, చంద్రశేఖర్, వంగాల శ్రీకాంత్, ప్రభుత్వ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల నాయకులు



సమావేశానికి హాజరైన విద్యార్థి సంఘాల నాయకులు

మలక్‌పేట: అధిక ఫీజులు వసూలు చేస్తూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా నడిపిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థి సమితి(టీవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మంద రమేష్ మాదిగ అధ్యక్షతన శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా హక్కు, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం బడుగ, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా విద్య అందించేలా చూడాలన్నారు. ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. సమావేశంలో బీసీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డేపల్లి రాకేష్, తెలంగాణ బహుజన కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజేందర్, తెలంగాణ స్టూడెంట్స్ జాక్ ప్రెసిడెంట్ అమన్‌గల్ రాజు, తెలంగాణ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు సప్ప సతీష్, నాయకులు ఫణీంద్ర, చిప్పలపల్లి వెంకన్న, నక్క రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడికి సేవా స్ఫూర్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న మార్గం రాజేష్

దిల్‌సుఖ్‌నగర్: వీఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ 11 వ వార్షికోత్సవ వేడుకలు, నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి వివిధ రంగాలలో విశేష సేవలందిస్తున్న ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్ ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు సేవా స్ఫూర్తి అవార్డు ను అందజేశారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నవీన్ వల్లం, విశ్రాంత డిప్యూటీ పోలీసు కమిషనర్ సుంకర సత్యనారాయణ, హాస్య బ్రహ్మ శంకర్ నారాయణ, సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ



హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, ఉత్పత్తులను ఆదరించాల్సిన అవసరం ఉందని, తద్వారా ఎందరికో ఉపాధి లభిస్తుందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా నిర్వాహకుడు అక్బర్‌అలీ అన్నారు. వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, చెప్పులు తదితర ఉత్పత్తులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నామని, ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

గంగుల అరుణారెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న గంగుల గోవర్ధన్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

నాగోలు: కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు గంగుల అరుణారెడ్డి ప్రథమ వర్ధంతి సభ నాగోలు సాయినగర్‌లోని స్వాగత్ గ్రాండ్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొని ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మహేశ్వరం నియోజకవర్గం నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, మహాత్మాగాంధీ లా కాలేజీ కార్యదర్శి గంగుల గోవర్ధన్‌రెడ్డి, గంగుల సాయి ప్రశాంత్‌రెడ్డి, గంగుల నవ్యా రెడ్డి, ఆర్‌కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్ నేత తదితరులు అరుణారెడ్డి నివాళులర్పించారు.

రోగి స్పృహలో ఉండగానే మెదడులోని కణితి తొలగింపు

కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



కోలుకున్న రోగితో కేర్ ఆసుపత్రి వైద్యులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. రోగి స్పృహలో ఉండగానే అతడికి శస్త్రచికిత్స చేసి మెదడులోని కణితిని తొలగించారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేర్ ఆసుపత్రి న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ కేవీ శివానంద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్‌కు చెందిన గిరిధర్(40) ఇటీవల మూర్ఛ వ్యాధితో బాధపడుతూ కేర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. అతడికి మెదడులో కణితి ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఇటువంటి వారికి సాధారణ సర్జరీ చేస్తే ప్రాణాపాయ ప్రమాదం ఉండటంతో అరుదైన అమిగ్డలో హిప్పోకాంపెక్టమీ అవేక్ క్రేనియటమీ సర్జరీ చేయాలని నిర్ణయించుకున్నారు. రోగికి కౌన్సిలింగ్ ఇచ్చి ఆపరేషన్‌కు ఒప్పించారు. ఈ సర్జరీ విధానంలో అనస్థీషియా బృందం రోగిని స్పృహలోనే ఉంచి, అతడితో నిరంతరాయంగా మాట్లాడుతుండగా..మెదడులోని కణితిని వైద్యులు తొలగించారు. సర్జరీ చేసిన నాలుగు రోజులకే రోగిని డిశ్చార్జ్ చేశారు. కేర్ ఆసుపత్రిలో మొదటిసారి చేసిన ఈ సర్జరీ విజయవంతం కావడంతో వైద్యులు ఆనందం వ్యక్తం చేశారు. సర్జరీలో భాగస్వాములైన వైద్యుల బృందాన్ని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి అభినందించారు.

సేజ్’ స్కూల్ స్పోర్ట్స్ డే

‘సేజ్’ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు శనివారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. టీఎస్ఆర్‌టీసీ డీవీఎం, మాజీ జాతీయ వాలీబాల్ ఆటగాడు జి.కిరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. – సిటీబ్యూరో



ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



‘ప్రజా పాలన’ దరఖాస్తులపై ఆరా తీస్తున్న చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. మూసారంబాగ్ డివిజన్ రజక సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ప్రజల నుంచి వచ్చి దరఖాస్తుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు.

శానిటరీ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

డీసీకి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



డీసీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న జీహెచ్‌ఎంసీ శానిటరీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరారు. శనివారం ఈ మేరకు గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో విధులు నిర్వహించే శానిటరీ జవాన్ రమేష్, శానిటరీ సూపరింటెండెంట్ విఠల్‌రెడ్డిలు ప్రజాపాలన కార్యక్రమంపై ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కార్యక్రమం ముగియక ముందే తొలగించారని వారు తెలిపారు. కాలనీవాసులతో ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వానికి, డిపార్ట్‌మెంట్‌కు చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చాకి రవికుమార్, ఆకుల రాజు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నాగోలు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని ఫలక్‌నామా, రోషన్ కాలనీ చెందిన మహమ్మద్ మారుఫ్ కుమారుడు మహమద్ యూసుఫ్ అలియస్ జైన్(18) శుక్రవారం రాత్రి స్నేహితులతో కలిసి ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. శనివారం 4 గంటల సమయంలో యూసుఫ్‌తో పాటు మరో ఇద్దరు యువకులు బ్లాక్ కలర్ బైక్ (టీఎస్07 కేబీ 4998 నంబర్)పై ఎల్‌బీనగర్ నుంచి టీకేఆర్ కమాన్ మార్గంలో సాగర్ రింగ్ రోడ్ ఫ్లైఓవర్ బైక్‌పై వెళ్తున్నారు. యూసుఫ్ నడుపుతున్న బైక్ స్కిడ్ అయి రోడ్డు పై పడిపోయాడు. దీంతో యూసుఫ్ తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడి తీవ్ర గాయాలు కాగా అక్కడ నుంచి వెళ్లిపోయాడు. స్థానికుల సమచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యూసుఫ్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. యూసుఫ్ తండ్రి మారూఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘నారాయణ’లో మాస్టర్ ఒరేటర్ గ్రాండ్ ఫినాలే



విద్యార్థులను ప్రశంసిస్తున్న పాఠశాల యాజమాన్యం

వనస్థలిపురం: ఎల్‌బీనగర్‌లోని నారాయణ ఈ.టెక్నో ఒలింపియాడ్ బ్రాంచ్‌లో శనివారం నిర్వహించిన మాస్టర్ ఒరేటర్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో వనస్థలిపురం నారాయణ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ భవానీ తెలిపారు. వివిధ బ్రాంచీలకు చెందిన ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అంగ్ల భాషా నైపుణ్యతను ప్రదర్శించి తమ విద్యార్థులు ముందంజలో నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విద్యాసంస్థ జీఎం గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ శరత్, ఏజీఎం హేమంబర్, ఆర్ఐ రవిప్రసాద్, హెచ్ఆర్ లక్ష్మి, కోఆర్డినేటర్ శివరంజని ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి అదృశ్యం

వేర్వేరు కారణాలతో మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ముగ్గురు అదృశ్యమయ్యారు. వీరిలో ఓ యువతి స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకల కోసమని వెళ్లి తిరిగి రాకపోగా, భార్యతో గొడవపడి వృద్ధుడు, ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకొనేందుకని వెళ్లి యువకుడు కనిపించకుండాపోయారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. – చంచల్‌గూడ

బర్త్ డే వేడుకలకు వెళ్లి..



నందిని

జన్మదిన వేడుకల కోసం స్నేహితురాలి ఇంటికి వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాని సంఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుర్మగూడ డివిజన్‌సాయిలాల్‌తోటలో నివాసముండే డి.నందిని (21) గత నెల 22న అదే ప్రాంతానికి చెందిన తన స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి దాటిన ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం అన్ని చోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి వృద్ధుడు



మోహిబుల్లా ఖాన్

భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు తిరిగి రాలేదు. దీంతో కుంటుంబ సభ్యులు శనివారం మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు...కుర్మగూడలో నివాసముండే మోహిబుల్లాఖాన్ (62) వృత్తిరీత్యా సెక్యూరిటీ గార్డు. గత నెల 20న భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు.రెండు వారాలు గడుస్తున్నా అతని ఆచూకీ తెలియరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రేమ వ్యవహారంలో యువకుడు..

ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకోవడానికి వెళ్తున్నానని లేఖ రాసి ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనంప్రకారం... రెయిన్‌బజార్‌లో నివాసముండే షేక్ సల్మాన్ (23) గత గురువారం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. బాలాపూర్‌కు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నానని తన గురించి వెతకవద్దని సోదరుడికి ఫోన్ చేసి చెప్పాడు. కాగా ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు శనివారం మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అనారోగ్యంతో యాచకుడి మృతి

చంచల్‌గూడ: అనారోగ్యంతో యాచకుడు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని చావణీ డివిజన్ ప్రాంతంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాకుత్‌పురా రషీదియా ఫంక్షన్ హాల్ వద్ద 60 సంవత్సరాల ఓ వృద్ధుడు విఘాతజీవుడై పడి ఉన్నాడని స్థానికుడు రయీజ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి తరలించారు. మృతుడి పేరు రమేష్ అని, పదేళ్లుగా అదే ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్టు తెలిసిందని పోలీసులు చెప్పారు. అనారోగ్యంతో మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. కాగా, రమేష్ సంబంధీకులు ఉంటే మాదన్నపేట పోలీసులను సంప్రదించాలని సూచించారు.